సాక్షి నల్లగొండ
శనివారం । 14 । జనవరి । 2023



బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేస్తాం
రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. -10లో



హరియాణా గ్యాంగ్ పనే ?
జిల్లా కేంద్రంలోని బీటీఎస్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఏటీఎం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.0°/16°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దేశ ప్రజల సంక్షేమమే కేసీఆర్ సంకల్పం
• మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్ : ప్రతికూల ఆలోచనలు వదిలి, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవాలనే సందేశాన్ని ఇచ్చే భోగి పండుగ ప్రజలందరి జీవితాల్లో నూతన కాంతులు తీసుకురావాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఆయన శుక్రవారం భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సమాజంలో ఆనందమయ స్ఫూర్తిని పెంపొందింపజేయాలని కోరారు. అందరికీ ఆరోగ్యం, శ్రేయస్సు చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు, సొంత గ్రామాలపై మమకారానికి, వ్యవసాయానికి, రైతులకు మనమంతా ఇచ్చే గౌరవానికి ఈ పండుగ ప్రతీక అని తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలను నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కనీస మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, ఏక కాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు, చేతి వృత్తిదారులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కున్‌రెడ్డి నాగారెడ్డి, నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, అశోక్‌రెడ్డి, రాంరెడ్డి, మంగారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

మునుగోడు : ప్రభుత్వ ఉద్యోగులకుసీపీఎస్ విధానం రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మునుగోడులో జరిగిన టీఎన్‌జీఓ మునుగోడు డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందించాలని, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నర్సింహాచారి, రాష్ట్ర కార్యదర్శి వెల్లంకి మాధవి, తిరుమలగిరి రమాదేవి, నాగిళ్ల మురళి, మేడి జయరావు, లక్ష్మయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆండాల్ అమ్మవారికి తిరువీధి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో సేవ, మండపంలో ఊంజలి సేవోత్సవం జరిపించారు. అంతకు ముందు వేకువజాము నుంచి సాయంత్రం వరకు ప్రధానాలయంలో నిత్యారాధనలు కొనసాగాయి.

నేడు గోదాదేవి కల్యాణం
ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7గంటలకు గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. 15న ఉదయం 11.30గంటలకు గోదాదేవికి ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమం ఉంటుందని ఆచార్యులు తెలిపారు. శుక్రవారం తిరుప్పావై వేడుకలు నిర్వహించారు.

• రామాలయంలో ఎదుర్కోలు



నల్లగొండలోని రామాలయంలో గోదా కల్యాణం సందర్భంగా ఎదుర్కోలు మహోత్సవం



స్వామి అమ్మవారిని తోడ్కొని వస్తున్న భక్తులు

• హైవేపై రయ్.. రయ్..



కేతేపల్లి : సంక్రాంతి రద్దీతో కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

సంబరాల సంక్రాంతి

• మూడు రోజుల వేడుక నేటి నుంచే.. • తొలిరోజున భోగి మంటలు, భోగిపండ్లు ప్రత్యేకం
• రంగవల్లులతో కళకళలాడనున్న లోగిళ్లు • కొన్ని గ్రామాల్లో ప్రత్యేక సంప్రదాయాలు



మూడు రోజుల వేడుకైన సంక్రాంతి సంబురాలు ప్రారంభమయ్యాయి. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, ఘుమఘుమలాడే పిండి వంటకాలు, అతివలు పోటీలు పడి తీర్చిదిద్దే రంగవల్లులు ఈ పండుగ ప్రత్యేకత. భోగి, మకర సంక్రాంతి, కనుమ ఈ మూడు రోజులకు ఒక్కో విశిష్టత ఉంది. శనివారం భోగి సందర్భంగా తెల్లవారుజాము నుంచే తమ లోగిళ్లను రంగురంగుల ముగ్గులతో అలంకరించడంతోపాటు భోగి మంటలు వేస్తారు. చిన్నారులకు భోగి పండ్లు పోస్తారు. ఆలయాల్లో గోదా రంగనాయక స్వామి కల్యాణం నిర్వహిస్తరు. జిల్లాలో సంక్రాంతిని కొన్నిచోట్ల ప్రజలు ప్రత్యేకంగా జరుపుకుంటారు.




ఫలహారం బండి (ఫైల్)

హోమంతాలపల్లిలో నేడు ఫలహారపు బండ్ల ఊరేగింపు

చింతపల్లి : సంక్రాంతి అనగానే గాలిపటాలు.. పిండి వంటకాలు, హరిదాసులు, కోడి పందాలు ఇవే మనకు తెలుసు. కానీ, చింతపల్లి మండలం హోమంతాలపల్లి గ్రామస్తులు మాత్రం సంక్రాంతి పర్వదినాన్ని ప్రత్యేకంగా జరుపుకుంటుంటారు. 300 ఏళ్ల క్రితం గ్రామంలో ఏర్పడిన పేర్వాండ్ల దేవాలయంతో ముడిపడిన తమ ఆచారాన్ని గ్రామస్తులు 122 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ఫలహారపు బండ్ల ఊరేగింపుగా పిలుచుకునే ఈ ఆనవాయితీని ఏటా సంక్రాంతి రోజున నిర్వహిస్తారు.

ఎడ్లబండ్లు, వాహనాల ఊరేగింపు
హోమంతాపల్లి గ్రామస్తులు సంక్రాంతి సందర్భంగా జరుపుకునే ఫలహారపు బండ్ల ఊరేగింపు సందర్భంగా ఉపవాస దీక్ష ఉంటారు. ఎడ్ల బండిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. సంక్రాంతి తర్వాత రబీ సీజన్ మొదలవుతుంది కాబట్టి తమ కాడెద్దులకు పూజలు చేస్తారు. వందల సంఖ్యలో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిలో స్వామివారి పూజా సామగ్రి, బొంగులు, బియ్యం పెట్టుకొని డప్పు చప్పుళ్లతో గోవింద నామస్మరణ చేస్తూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణగా ఊరేగింపు నిర్వహిస్తారు. వేగంగా సాగే ఈ ఊరేగింపులో ఇప్పటి వరకు ఎలాంటి అపశృతి చోటు చేసుకోకపోవడం గమనార్హం. ఎడ్లబండ్లతో పాటు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను సైతం ఊరేగింపులో వినియోగిస్తున్నారు. ఈ ఊరేగింపును తిలకించేందుకు హైదరాబాద్‌తో పాటు దేవరకొండ, మాడ్గుల, మర్రిగూడెం, నాంపల్లి, చారగొండ, కల్వకుర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. కాగా ఈనెల 15న జరిగే ఫలహారపు బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

అంకిరెడ్డిగూడెంలో ప్రత్యేకం



అంకిరెడ్డిగూడెంలో భోగి మంటలు

చౌటుప్పల్ : మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెంలో రెడ్డి కులస్తులు కుటుంబాలు సుమారుగా వంద వరకు ఉన్నాయి. వారంతా ఏటా సంక్రాంతి రోజున కలిసి వేడుకలను జరుపుకుంటారు. భోగి రోజున చౌరస్తా వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి.. భోగి మంటలు వేస్తారు. ఆ మంటలో ఒక నీటి కుండను ఉంచి ఆ నీరు వేడయ్యాక.. ఇంటికో మగ్గు చొప్పున నీటిని తీసుకెళ్లి సాధారణ నీటిలో కలుపుకుని ఇంటిల్లిపాదీ స్నానాలు చేస్తారు. భోగి రోజున ఇలా ప్రత్యేక పూజలు చేయడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్య ఉన్నా తీరుతుందని.. గ్రామానికి చెందిన రెడ్డి కుటుంబాల నమ్మకం. జీవనోపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లిన, అక్కడే నివాసం ఉండే కుటుంబాలు సైతం గ్రామంలో జరిగే భోగి పూజల్లో పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తాయి. ఈ పూజల్లో రెడ్డి కుటుంబీకులే కాకుండా గ్రామానికి చెందిన ఇతర కుటుంబాలు సైతం పాల్గొంటాయి.

ఎంతో నమ్మకంగా పూజలు



భోగి రోజున రెడ్డి పరివార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఎంతో నమ్మకంగా పదేళ్లుగా ఈ పూజలు నిర్వహిస్తున్నాం. ఈ పూజలతో అనారోగ్య సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకం ఏర్పడింది. ఇతర ప్రాంతాలకు వెళ్లిన, స్థిరపడిన కుటుంబాలు కూడా భోగి రోజున గ్రామానికి వస్తాయి.
– పర్నె శ్రీనివాస్‌రెడ్డి

మోత్కూరులో బోనాలతో వెళ్తున్న మహిళలు (ఫైల్)



మోత్కూరులో 'భోగి' బోనాలు

మోత్కూరు : మోత్కూరులో సంక్రాంతి పండుగకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ పండుగను ఇక్కడి ప్రజలు వినూత్నంగా జరుపుకుంటారు. భోగి రోజున ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి, గౌడ కులస్తులు కంఠ మహేశ్వర స్వామికి బోనాలు సమర్పిస్తారు. ఉగాది పండుగకు ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. 2009లో బిక్కేరు సమీపంలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి ముదిరాజ్ కులస్తులు భోగికి ముందు రోజు గణపతి పూజ, అభిషేకం, హోమాలు నిర్వహిస్తారు. సంక్రాంతి రోజున గ్రామాలు వదిలి వన భోజనాలకు వెళ్లడం ఇక్కడ సాంప్రదాయంగా మారింది. గౌడ కులస్తులు సుమారు రెండు దశాబ్దాల కాలంగా భోగి రోజున బోనాలు నిర్వహిస్తున్నారు. బిక్కేరు వాగు వద్ద, ఇందిరానగర్ కాలనీ సమీపంలో ఉన్న కంఠ మహేశ్వర స్వామి ఆలయాలకు గౌడ మహిళలు తీపి బోనాలతో ఊరేగింపుగా తీసుకెళతారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. సంక్రాంతి రోజున వన మైసమ్మ, రేణుక ఎల్లమ్మ దేవతలకు యాటలు, కోళ్లను బలిస్తారు.

వారి పిండి వంటకాలు ఎంతో ఫేమస్..



భానుపురి (సూర్యాపేట) : పండుగ ఏదైనా పిండి వంటకాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డ. స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు సైతం ఇక్కడికి వచ్చి పిండి వంటకాలు చేయిస్తుంటారు. పండుగల సమయంలో ఇక్కడి పిండి వంటకాల కోసం ఆసక్తి చూపుతుంటారు. ప్రధానంగా ఆర్డర్ చేయించి మరీ తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ వరసగా నాలుగు దుకాణాలు ఉండగా అన్నీ ఒకే కుటుంబానికి చెందినవి. వీరంతా అన్నదమ్ముల్ల పిల్లలు కాగా.. దాదాపు 30 ఏళ్లుగా ఇదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. అన్ని దుకాణాల్లోనూ తాజా పిండి వంటకాలు అందుబాటులో ఉంటున్నాయి.

వంటకాలు ఇవీ..
ఇళ్ల వద్ద పిండి వంటకాలు చేసేందుకు అవకాశం లేకపోవడం, ఇబ్బందిగా ఉన్న ప్రతి ఒక్కరూ పండుగల సమయంతో పాటు సాధారణ రోజుల్లోనూ తాళ్లగడ్డకే వస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ సన్నపూస, దొడ్డు పూస, ఆకు పకోడి, అరిసెలు, లడ్డూ, పూస బిళ్లలు, చేగోడీలు, గరిజెలు నిత్యం తయారు చేస్తుంటారు. పిండి, నూనె, ఇతర సామగ్రిని కస్టమర్లు తీసుకొస్తే లడ్డూ, అరిసెలు తయారు చేయించినందుకు గాను కేజీ రూ.150, పూస, ఆకుపకోడి తదితర వంటకాలు చేస్తే కేజీ రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక ఏది లేకుండా కొనుగోలు చేస్తే సన్నపూస, దొడ్డుపూస, ఆకుపకోడి, అరిసెలు, లడ్డూ, పూస బిళ్లలు, చేగోడీలు రూ.200ల చొప్పున, గరిజెలకు రూ.300ల చొప్పున విక్రయిస్తున్నారు.



పిండి వంటకాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళ

బసవన్న దీవెన



యాదగిరిగుట్టలో బసవన్నలు

తిరుమలగిరి, యాదగిరిగుట్ట : శుభోజయం మారాజా.. శుభోజయం.. మీ ఇంట పాడిపంటలు పొంగిపొర్లాల.. మీ పిల్లా పాపాలతో జయం కలగాలా. దొరగారి బిడ్డలు సల్లాంగుండాలా.. శుభోజయం మారాజా.. శుభోజయం అంటూ గంగిరెద్దును ఇంటి ముందుకు తీసుకొచ్చి గంగిరెద్ల వారు చేయించే విన్యాసాలు సంక్రాంతి పండగకు ప్రత్యేకం. మన ఇంటి ముందు డూడూ బసవన్నతో కలిసి పేరుపేరున దీవెనలు అందించేటప్పుడు కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. సంక్రాంతి రోజున గంగిరెద్దుల ఆటలతో పల్లెలన్నీ సందడిగా మారతాయి.

ధనుర్మాసం ప్రారంభం కాగానే..
గంగిరెద్ల కుటుంబాలు తరతరాల నుంచి ధనుర్మాసం ప్రారంభం కాగానే వివిధ ప్రాంతాలకు సంచార జీవులుగా బయలు దేరుతాయి. గంగిరెద్లవారు బసవన్నతో ప్రతి ఇంటి వాకిట నిలబడి ఆ ఇంటి యాజమానులను పేరుపెట్టి పిలిచి.. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ పాటలు పడుతారు. వారి పాటలకు లయబద్ధంగా గంగిరెద్లు తలూపుతూ అందరినీ ఆకర్షిస్తాయి. ఇంటి ఇల్లాలు ఇచ్చిన ధాన్యం, తౌడు బసవన్నకు తినిపిస్తారు. గంగిరెద్దులతో నాట్యం చేయించి ఆటలు ప్రదర్శిస్తారు. దండిగా నజరానాలు ఇచ్చిన వారిని మెండుగా దీవించి గ్రామాలన్నీ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలని దీవించి మరి వెళ్తుంటారు.

బాసికాలతో ముస్తాబు..
తమ ఇంటికి వచ్చిన గంగిరెద్దును సాక్షాత్తూ నందీశ్వరుడి స్వరూపంగా భావించి ఇంటి వారు హారతి పట్టి పూజిస్తారు. నవ దంపతులు పెళ్లి సమయంలో ధరించిన బాసికాలు, కర్పూర దండలు గంగిరెద్లకు అలంకరిస్తే శుభం జరుగుతుందని నమ్మకం. సంక్రాంతి రోజున ఇంటి ముందుకు వచ్చే బసవన్నలకు వీటిని ఇవ్వడంతో పాటు కొంత సొమ్మును ముట్టజెప్పి దీవెనలు పొందుతారు. బసవన్నలకు రంగురంగుల వస్త్రాలు అలంకరించి నుదుటన వెంకటేశ్వర నామాలు పెట్టి కొమ్ములకు ప్రత్యేకంగా రంగులద్ది.. అలనాటి సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో అలంకరిస్తారు.

కనిపించని గంగిరెద్దులు..
గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు సంక్రాంతి వచ్చిందంటే 15 రోజుల ముందుగానే గంగిరెద్దుల సందడి ఉండేది. కానీ ప్రస్తుతం అవి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆధునిక కాలంలో వాటికి ఆదరణ లేకుండా పోయింది. పొట్టకూటి కోసమే కాకుండా గంగిరెద్దుల కళను ప్రదర్శించేందుకు వచ్చే వీరికి జీవనాధారం ఉండడం లేదు. దీంతో గ్రామాల్లో గంగిరెద్దుల కళ తప్పి.. కళాకారులు పట్టణాల బాటపడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు 'మీటర్' మెలిక!

• కనెక్షన్ తీసుకున్న వారికే ఉచిత విద్యుత్ అమలు
• అనధికారికంగా వాడుకుంటే కేసులు నమోదు
• మూడు సార్లు పట్టుబడితే ఊచలు లెక్కించాల్సిందే
• అనధికారిక విద్యుత్ వినియోగదారులు 30వేలమందికిపైనే..



నల్లగొండ : ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న 101యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి ప్రభుత్వం మీటర్ కనెక్షన్ తప్పనిసరి చేసింది. ఉచిత విద్యుత్ పథకం అమలవుతుందన్న కారణంతో చాలా గ్రామాల్లో కొందరు అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఇళ్ల ముందు వెళ్తున్న వైర్లకు కొండీలు తగిలించి విద్యుత్‌ను వాడుకుంటున్నారు. తద్వారా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిని నివారించేందుకు ప్రభుత్వం వీరికి మీటర్‌ను తప్పని సరి చేసింది. ఇకపై నేరుగా ఉచిత విద్యుత్ పొందాలంటే మీటర్లు తీసుకోవాల్సిందేనని షరతు విధించింది.

51 నుంచి 101యూనిట్లకు పెంపు
జిల్లాలో కేటగిరి 1కింద 4లక్షల పైచిలుకు గృహ వినియోగదారులు విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. అయితే, గతంలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 51యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను గృహవసరాలకు సరఫరా చేసేది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని 101యూనిట్లకు పెంచింది. వినియోగదారులు తమ ఇంటికి 101 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించుకుంటే బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వమే 6మాసాలకు ఒకసారి సబ్ ప్లాంట్ కింద విద్యుత్ శాఖకు వీరి బిల్లు చెల్లిస్తుంది.

70వేల మందికే ఉచిత విద్యుత్
జిల్లా వ్యాప్తంగా 70వేల మందికి పైగా ఎస్సీ, ఎస్టీలు కనెక్షన్ తీసుకుని ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకానికి అర్హత సాధించారు. ఇంకా 30వేల మందికి పైగా విద్యుత్ మీటర్లు తీసుకోవాల్సి ఉంది. అయితే, చాలా గ్రామాల్లో వీరంతా ఇంటి ముందు ఉన్న వైర్ల నుంచి కొండ్లు తగిలించి నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వాడుకుంటున్నారు. తద్వారా వీరు ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్ పొందలేని పరిస్థితి.

కేసులతో పాటు జరిమానా
అనధికారికంగా విద్యుత్ వినియోగించే వారిపై విద్యుత్ శాఖ కఠినంగా వ్యవహరించనుంది. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మీటర్లు తీసుకుంటేనే ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌కు అర్హులు అవుతారని అధికారులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాడుకుంటే కేసులు బుక్ చేస్తామని, 3 సార్లు పట్టుబడితే ఊచలు లెక్కించాల్సిందేనని హెచ్చరిస్తున్నారు. దీంతో పాటు ఇన్నేళ్లు విద్యుత్‌ను వాడుకున్నందుకు జరిమానా కూడా వేసే అవకాశం ఉంటుందని అంటున్నారు.

మీటర్లు ఉంటేనే ఉచిత విద్యుత్



ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పొందాలంటే మీటర్లు తప్పనిసరి. ప్రభుత్వం 101యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తున్నందున నేరుగా మీటర్లు తీసుకొని ఉచిత విద్యుత్ పొందొచ్చు. బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. కొండ్లు తగిలిస్తే కేసులు నమోదు చేస్తాం.
– టీఆర్. చంద్రమోహన్ విద్యుత్ శాఖ ఎస్ఈ

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలి



క్రీడాకారులతో జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించాలని జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ అన్నారు. ఈ నెల 21నుంచి 23 వరకు రంగారెడ్డి జిల్లాలో జరుగనున్న 7వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపికకు శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతి రోజు సాధన చేయడం ద్వారా పోటీల్లో గెలుపొందేందుకు మార్గం సులభం అవుతుందన్నారు. ఈ పోటీలకు 70మంది క్రీడాకారులు హాజరు కాగా ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసాచారి, కోచ్ యావర్, కార్తిక్, లింగస్వామి పాల్గొన్నారు.

30న రెండు చోట్ల ఉప సర్పంచ్‌ల ఎన్నిక

నల్లగొండ : జిల్లాలో రెండు పంచాయతీల్లో ఈ నెల 30న ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలోని నిడమనూరు మండలం గుంటకగూడెం, మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామాల్లో ఉప సర్పంచ్‌లను అవిశ్వాస తీర్మానంతో తొలగించడంతో.. కొత్త వారి ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికకు సంబంధించి ఈనెల 25వ తేదీలోగా ఈ రెండు పంచాయతీల నోటీసులు అందించనున్నారు.

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన బైరు వెంకటయ్య

నార్కట్‌పల్లి : తాటి చెట్టు పైనుంచి కింద పడి ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చౌటబావి శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి గ్రామానికి చెందిన బైరు వెంకటయ్య గీత కార్మికుడు. కులవృత్తిలో భాగంగా శుక్రవారం చౌటబావి గ్రామంలో కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కి దిగే సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రికి తరలించారు.

కలుషిత నీటితో చేపలు మృతి


లింగరాజుపెల్లి చెరువులో చనిపోయిన చేపలు

వలిగొండ : కలుషిత నీటితో పాపినేని చెరువులోని చేపలు మృతిచెందాయని మండలంలోని లింగరాజుపల్లి మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు నీళ్ల శ్రీను తెలిపారు. పాపినేని చెరువులోకి భీమలింగం కాల్వ ద్వారా వచ్చిన కలుషిత నీటి కారణంగా ఆరు నెలల క్రితం ప్రభుత్వం పంపిణీ చేసిన చేపలు మొత్తం మృతిచెందాయని వాపోయారు. కార్యక్రమంలో బుంగమట్ల పాండు, నీళ్ల భిక్షపతి, పెద్దగోని నర్సింహ, నీళ్ల నరేష్ పాల్గొన్నారు.

కల్తీపాల కేసులో నిందితుల రిమాండ్

బీబీనగర్: మండలంలోని కల్తీ పాలను తయారు చేయడంతో పాటు, లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్న ముగ్గురిని భువనగిరి కోర్టు మెజిస్ట్రేట్ శుక్రవారం 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. ఈ నెల11న ఆహార భద్రత అధికారులు మండలంలోని కొండమడుగు, బీబీనగర్‌లోని పాల కేంద్రాలపై తనిఖీలు నిర్వహించగా కొండమడుగు గ్రామానికి చెందిన పాల వ్యాపారి కడెం కుమార్ రోజుకు 600లీటర్లకు పైగా పాలను పరిసర ప్రాంతాల్లో సేకరించి జంట నగరాలతో పాటు మండలంలోని జాతీయ రహదారిపై హోటళ్లలో, స్వీట్‌షాపులలో విక్రయిస్తున్నాడు. కాగా, కుమార్ పాలల్లో మనుషుల శవాల భద్రతకు ఉదపయోగించే ఫార్మాల్డీహైడ్ కెమికల్‌ను వాడుతూ పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండే విధంగా, తక్కువ పాలతో ఎక్కువ కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు అధికారులు నమూనాలను సేకరించారు. అలాగే బీబీనగర్‌కు చెందిన బింగి శ్రీనివాస్, బండారు శేఖర్‌రెడ్డి లైసెన్స్‌లు పొందకుండా పాలను కొనుగోలు చేయడం వాటిని కల్తీ చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు ముగ్గురిపై బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించి జైలుకు తరలించారు.

జాతీయ రహదారులపై వాహనాల రద్దీ

- సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్తున్న ప్రజలు
- టోల్‌ప్లాజాల వద్ద బారులుదీరిన వాహనాలు


చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం రాత్రి జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ జనమంతా పల్లెల వైపుకు పయణమయ్యారు. దీంతో శుక్రవారం హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. గత రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు వెళ్తున్న వారి సంఖ్య రెండింతలుగా ఉన్నట్టు పలువురు అంచనా వేస్తున్నారు. పట్టణంలో 2కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. అదే విధంగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద తీవ్రమైన వాహనాల రద్దీ ఏర్పడింది. విజయవాడ మార్గంలో 10టోల్ బూతుల ద్వారా వాహనాలను పంపించారు. సాధారణ రోజుల్లో 30–40వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ప్రస్తుతం అదనంగా మరో 20–30వేల వాహనాలు రాకపోకలు సాగించినట్టు అంచనా.

కేతేపల్లి : సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లే వారి వాహనాలతో 65 నంబర్ జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. శుక్రవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమ స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో సంక్రాంతికి ఒకరోజు ముందుగానే హైవేపై వాహనాల సందడి మొదలైంది. సాధారణ రోజుల్లో ప్రతిరోజు 18నుంచి 20వేల వాహనాలు టోల్‌ప్లాజా నుంచి రాకపోకలు సాగిస్తుండగా శుక్రవారం ఒక్కరోజులోనే దాదాపు 38వేల వాహనాలు వెళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా కొర్లపహాడ్‌లోని టోల్‌ప్లాజా నిర్వాహకులు విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు టోల్ చెల్లించేందుకు అదనపు కౌంటర్లు కేటాయించారు. విరామం లేకుండా వాహనాలు వెళ్తుండటంతో మండలంలోని రహదారి వెంట ఉన్న గ్రామాల్లోని ప్రజలు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు.

చిట్యాల : సంక్రాంతి పండగ సందర్భంగా హైదరాబాద్‌నుంచి విజయవాడ వైపునకు ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు చిట్యాలలో హైవేపై శుక్రవారం బారులుదీరాయి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. చిట్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద పట్టణ ప్రజలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పోలీసులు ట్రాఫిక్ ఇబ్బ ందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

కోదాడరూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ భారీగా నెలకొంది. దీంతో రహదారిపై ప్రమాదాలకు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని కొమరబండ క్రాస్‌రోడ్, కట్టకమ్ముగూడెం, శ్రీరంగాపురం, చిమిర్యాల, రామాపురం క్రాస్‌రోడ్‌ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించడానికి రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందిని నియమించారు.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద రద్దీ..

బీబీనగర్ : సంక్రాంతి పండుగ సందర్భంగా జంట నగరాల నుంచి ప్రజలు సొంత గ్రామాలకు వెళ్తుండడంతో శుక్రవారం మండలంలోని గూడూరు టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి పెరి గింది. దీంతో వాహనాలు భారీగా బారులుదీరా యి. వరంగల్ వైపు వాహనాలు అర కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోజుకు 20వేల వరకు వాహనాలు రాకపోకలు ఉండగా శుక్రవారం వర ంగల్ వైపు 30వేలకు పైగా వాహనాలు వెళ్లడంతో టోల్‌ప్లాజాకు అదనంగా ఆదాయం సమకూరింది.


చిట్యాల: హైవేపై వాహనాల రద్దీ


బీబీనగర్ : గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 99124 40783, 96660 13544

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


తరుణ్ (ఫైల్)

పాలకవీడు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. పాలకవీడు, రామన్నపేట, అడ్డగూడూరు మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన రమావత్ తరుణ్(18) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం తన స్నేహితులతో కలిసి మిర్యాలగూడకు వెళ్లి మొబైల్ కొనుగోలు చేశాడు. సాయంత్రం తిరిగి వస్తున్న సమయంలో నేరేడుచర్లలో పని ముగించుకుని రాత్రి ఎనిమిది గంటల సమయంలో బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో బెట్టిగూడెం గ్రామ శివారులో మూలపు వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న భగీరథ ఎయిర్ వాల్వ్‌కు ఢీకొట్టి పొలాల్లో పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీసి స్థానికుల సహాయంతో శూన్యపహాడ్‌కు చెందిన తరుణ్‌గా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరికొద్దిసేపట్లో ఇంటికి చేరుకుంటున్నాడనుకున్న తమ కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

రెండు బైక్‌లు ఢీకొని..

రామన్నపేట : నార్కట్‌పల్లి మండలం తొండ్లాయి గ్రామానికి చెందిన తొట్ల సత్యనారాయణ(30) గురువారం ఎన్నారంలోని బంధువుల ఇంటికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యలో గ్రామ శివారులోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ లక్ష్మ య్య తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


సైదులు మృతదేహం

అడ్డగూడూరు : నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి సైదులు (28) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సైదులు గురువారం మోత్కూర్ మండలంలో బంధువులు నిర్వహిస్తున్న ఫంక్షన్‌కు బైక్‌పై హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మండల పరిధిలోని చౌల్లరామారం గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

హరియాణా గ్యాంగ్ పనే ?

వీడిన ఏటీఎం చోరీ కేసు చిక్కుముడి

- సూత్రధారి నల్లగొండ పాతబస్తీ వాసి
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దొంగల గుర్తింపు
- సీసీఎస్ పోలీసుల అదుపులో నిందితులు


నల్లగొండ పట్టణంలో చోరీ జరిగిన ఎస్‌బీఐ ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

నల్లగొండ క్రైం : జిల్లా కేంద్రంలోని బీటీఎస్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఏటీఎం చోరీ కేసు చిక్కుముడి వీడినట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాలకు రంగేసి.. ఏటీఎంను గ్యాస్‌కట్టర్‌తో తెరిచి రూ.14లక్షలు అపహరించుకుపోయింది హరియాణా గ్యాంగ్ అని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

సెల్‌ఫోన్‌లో వీడియో తీసి..

నీలగిరి పట్టణంలోని పాతబస్తీకి చెందిన ఆమెర్ గతంలో పండ్ల వ్యాపారం చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆటో నడుపుతున్నాడు. ఇతడికి హైదరాబాద్‌కు చెందిన పాత నేరస్తుడైన ఆమెర్‌తో పరిచయం ఉంది. అయితే, పట్టణానికి చెందిన ఆమెర్ అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఆమెర్ పట్టణంలోని బీటీఎస్ ప్రాంతంలోని ఏటీఎంను వీడియో తీసి హైదరాబాద్‌లో ఉన్న పాత నేరస్తుడు ఆమెర్‌కు వాట్సాప్ చేశాడు. ఇతడు హరియాణా గ్యాంగ్‌తో కలిసి ఇది వరకే పలు చోరీల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆమెర్ షేర్ చేసిన వీడియో ఆధారంగా హరియాణా గ్యాంగ్ హైదరాబాద్‌కు చేరుకుంది.

కారు అద్దెకు తీసుకుని..

ఆమెర్ షేర్ చేసిన వీడియో ఆధారంగా హరియాణా నుంచి ముగ్గురు ముఠా సభ్యులు గత నెల 20తర్వాత హైదరాబాద్‌కు చేరుకున్నారు. నల్లగొండ పాతబస్తీకి చెందిన ఆమెర్, హైదరాబాద్ పాత నేరస్తుడు ఆమెర్‌తో పాటు హరియాణాకు చెందిన ముగ్గురు ఏటీఎం చోరీకి పకడ్బందీ పథకాన్ని రచించారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఓ కారును అద్దెకు తీసుకుని నల్లగొండకు చేరుకున్నారు.

ఇద్దరు కారులో.. ముగ్గురు బస్సులో..

కారులో పనిముట్లతో సహా నీలగిరికి చేరుకున్న ముఠా సభ్యులు చాకచక్యంగా సీసీ కెమెరాలకు రంగేసి, ఆపై గ్యాస్ కట్టర్ సహాయంతో ఏటీఎంను తెరిచి రూ.14లక్షల నగదును అపహరించారు. అనంతరం డబ్బును ఐదుగురు పంచుకుని ఎవరికీ అనుమానం రాకుండా ఇద్దరు నిందితులు కారులో, మరో ముగ్గురు ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వెళ్లారు.

సీసీ కెమెరాల ఆధారంగా..

చోరీ జరిగిన రోజు పోలీసులు సమీపంలోని సీసీ కెమారాలో రికార్డును పరిశీలించారు. కారు నంబర్ ఆధారంగా లింక్‌ను ఛేదించిన పోలీసులు కేశరాజుపల్లి, మర్రిగూడ బైపాస్, చిట్యాల, బీబీనగర్ రోడ్డులో కారు నంబర్‌ను గుర్తించారు. హైదరాబాద్‌లో కారును అద్దెకు ఇచ్చిన నిర్వాహకుడి వద్ద రికార్డు పరిశీలించగా పూర్తి వివరాలు తెలిశాయి. హైదరాబాద్‌లో పాత నేరస్తుడు ఆమెర్‌తో పాటు నల్లగొండకు చెందిన ఆమెర్‌ను విచారించగా చోరీకి పాల్పడింది హరియాణా గ్యాంగ్ అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

మరో చోరీ చేయాలని రప్పించి..

హరియాణా ముఠా సభ్యులను రప్పించేందుకు పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. తమ అదుపులో ఉన్న ఇద్దరు నిందితులతో హరియాణా గ్యాంగ్‌కు ఫోన్ చేయించి మరో చోరీ చేయాలని రప్పించారు. నిందితులు రైలులో హైదరాబాద్‌కు టికెట్ బుక్ చేసుకోగా ఆ వివరాలు తెలుసుకుని ఖాజీపేటలో మాటు వేశారు. అయితే, దొంగల సమాచారం ఉన్న హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు సైతం ఖాజీపేటకు చేరుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకునేందుకు అటు హైదరాబాద్, ఇటు నల్లగొండ సీసీఎస్ పోలీసులు పోటీపడ్డారు. ఈ క్రమంలో ఇద్దరు దొంగలను హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకోగా, ముగ్గురు నిందితులు నల్లగొండ సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీరు ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడ్డారు? అనే తదితర అంశాలపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, డీఈఓ భిక్షపతి ఉపాధ్యాయ సంఘం నాయకులు

నల్లగొండ : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డైరీని స్థానిక పట్టణంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, డీఈఓ భిక్షపతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, కార్యదర్శి విజయ్‌కుమార్, లింగయ్య, చక్రధర్, శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత


చెక్కు అందజేస్తున్న దివీస్ అధికారులు, సర్పంచ్‌లు

చౌటుప్పల్ : ప్రతిభావంతులైన విద్యార్థులకు తమ పరిశ్రమ తోడ్పాటునందిస్తుందని దివీస్ ఈహెచ్‌ఎస్ శాఖ జనరల్ మేనేజర్ బాలకిషోర్ తెలిపారు. లింగోజిగూడెంలోని దివీస్ పరిశ్రమ కార్యాలయంలో శుక్రవారం 41మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.6.44లక్షల విలువైన ఉపకార వేతనాలను పంతంగి, దేవలమ్మనాగారం సర్పంచ్‌లు బాతరాజు సత్యం, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. పేద విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారికి ఉన్న విద్య లభిస్తుందన్నారు.కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు సీహెచ్.వీరయ్య, సాంబశివరావు, కె.శివప్రసాద్, బీకేకేచౌదరి, వల్లూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

నార్కట్‌పల్లి : ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. నార్కట్‌పల్లికి చెందిన ఐతరాజు కవిత (35) రామకృష్ణ దంపతులు స్థానికంగా చికెన్‌షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏడాది నుంచి వ్యాపారం సరిగా నడవకపోవడంతో కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెందిన కవిత ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. భర్త ఇంటికి వచ్చి షట్టర్ బలవంతంగా తీసుకుని లోపలికి వెళ్లి చూసే సరికి ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి రెడ్డి రాజుల చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

గాయపడిన టీచర్ మృతి

గుర్రంపోడు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు మృతిచెందింది. మున్సిపాలిటీ పరిధి చర్లపల్లిలోని సప్తగిరి విల్లాస్‌లో నివాసం ఉంటున్న వన్య (38) దేవరకొండ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. నిత్యం ఆటోలో విధులకు వెళ్లి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో గురువారం విధులు ముగించుకుని మరో ఉపాధ్యాయురాలితో కలిసి ఆటోలో తిరిగిస్తున్నారు. మార్గమధ్యలో మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామం వద్ద వీరి ఆటోను అదుపుతప్పిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వన్యతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ శుక్రవారం వన్య మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగృహమైన చర్లపల్లిలోని సప్తగిరి విల్లాస్‌కు తరలించారు. వన్య మృతికి అధ్యాపకులు సంతాపం తెలిపారు.

విధుల్లో చేరిన యాదాద్రి అదనపు కలెక్టర్


అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

భువనగిరిటౌన్ : నెల రోజులు సెలవుపై వెళ్లిన రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు. ఆయన తన సొంత పనులపై విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. విధుల్లో చేరిన అదనపు కలెక్టర్‌కు కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, జిల్లా తెలంగాణ గెజిటెట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి పూల బొకేలు అందజేసి స్వాగతం పలికారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గజిటెట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌ప్రసాద్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.లక్షల్లో అవినీతి

- ఓపెన్‌ఫోరంలో రూ.11.62లక్షల రికవరీకి ఆదేశం

పెన్‌పహాడ్ : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మండలంలో అధికారులు, మేట్లు భారీ అవినీతికి పాల్పడినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. రెండు రోజులుగా మండల కేంద్రంలో 29గ్రామాల్లో నిర్వహించిన తనిఖీపై నిర్వహించిన ఓపెన్‌ఫోరం శుక్రవారం తెల్లవారుజామున ముగిసింది. ఈ సమావేశంలో రూ.18కోట్ల 80లక్షలతో రెండు సంవత్సరాలుగా చేపట్టిన పనులకు గాను అక్రమాలు వెలుగుచూశాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పనిచేసిన చోట కొలతలు, పనిచేయని వారి మస్టర్లలో పేర్లు, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు పనిచేసినట్లు, పల్లెప్రకృతి వనాల్లో జూన్, జూలై మాసాల్లో కూడా నీళ్లు పోసినట్లు నిధులు డ్రా చేశారు. శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్లు పనులు పూర్తి చేయకుండా పూర్తి స్థాయిలో నిధులు డ్రా చేశారు. దీంతో సుమారు రూ.11.62లక్షలు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించి 122మంది మేట్లను తొలగించి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ పెంటయ్య, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, ఎస్సార్పీ రమేష్, అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, ఏవీఓ ఆశ, ఏపీఓ రవి, ఈసీ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate





LAND FOR SALE

■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

Services

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1741]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776024]

■ ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ ద్వారా పార్ట్ టైం మరియు ఫుల్‌టైం వ్యాపార అవకాశం కలదు. వివరాలకు సంప్ర॥ మేనేజర్ : 9985944266 [Y-772727]

■ కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట మండలంలోని ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో మా సంస్థ అయిన సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, గుంటూరు తరుపున పనిచేయుటకు మంచి దేహదారుఢ్యము కలిగిన సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు 30–45 సం॥ అర్హత: ఇంటర్/డిగ్రీ, ఎత్తు:05'–06'' ఆపైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలటరీ వారికి ప్రాధాన్యత. సెక్యూరిటీ గార్డ్ అర్హతలు: వయస్సు 30–45 సం॥ పదవ తరగతి, ఎత్తు: 05'–06'' ఆపైన సంప్ర: 8466996958, 7901389772 [G-522]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.